# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1 **రాజధాని అమరావతిలో నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్న పురపాలకశాఖ మంత్రి నారాయణ.**

2 **2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్న రాజమహేంద్ర వరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి**

3 **రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి 16 వేల 627 కోట్ల రూపాయల నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం**

4 **రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలు**

==========================

రాజధాని అమరావతిలో నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. అమరావతిలో కొండవీటి వాగు.. పాల వాగులపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ ఆధ్వర్యంలో వాగులపై 43 వంతెనలు, లే అవుట్లలో మరో 26 వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. వాన కాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువ పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని... అవసరమైతే జేసీబీలతో వెంటనే చర్యలు చేపట్టాలని నారాయణ అన్నారు. మరో ఏడాదిలో ఎక్కువశాతం వంతెనల పనులు పూర్తి కానున్నాయని మంత్రి నారాయణ వివరిస్తూ ..

వాయిస్ 30

--------------------------

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్ర వరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. ప్రగతి పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి అభివృద్ధి పనులను ఆమె ఈరోజు పరిశీలించారు. అనంతరం పురంధేశ్వరి మాట్లాడుతూ, రాజమహేంద్రవరం-దివాన్ చెరువు ఫ్లైఓవర్ నిర్మాణానికి అయ్యే 327 కోట్ల రూపాయలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే

ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి, రహదారి భద్రత మెరుగుపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ..

వాయిస్ 29

---

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా ఈ రోజు స్పందిస్తూ.. 12 ఏళ్ల క్రితం భారత యువత అవకాశాల కోసం వెతికేదని, ప్రస్తుతం యువతే అంకుర సంస్థలను స్థాపించి కొత్త అవకాశాలను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో 2 లక్షల 20 వేలకుపైగా అంకుర సంస్థలు 23 లక్షలకుపైగా ఉద్యోగాలను కల్పిస్తున్నాయని తెలిపారు. అలాగే క్రీడల్లో రికార్డు స్థాయి పతకాలు, ప్రపంచ స్థాయి సంస్థల ఏర్పాటు, ఆవిష్కరణల రంగంలో భారీ పెట్టుబడులు దేశ అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

---

నీటి వనరులు, చెరువుల సంరక్షణ లక్ష్యంగా సోమవారం నుంచి పార్వతీ పురం మన్యం జిల్లా వ్యాప్తంగా “జలరక్షణ”కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు, జల వనరుల శాఖ, ఇతర శాఖల అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేపటిలోగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో చెరువుల హద్దుల సర్వే ప్రక్రియను పూర్తి చేసి,సోమవారం నుంచి క్షేత్రస్థాయి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా ఇప్పటికే జలధార,జలహారతి కార్యక్రమాల అమలులో ముందంజలో ఉన్నామని పేర్కొన్న కలెక్టర్,ఇకపై జలరక్షణ కార్యక్రమాన్ని కూడా సమాంతరంగా వేగవంతం చేసి విజయవంతం చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.

---

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 16 వేల 627 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది. 16వ ఆర్థిక సంఘం కింద మంజూరైన ఈ నిధులతో వచ్చే ఐదేళ్లలో గ్రామాలలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. గత 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి లభించిన నిధులతో పోలిస్తే దాదాపు 3వేల 800కోట్ల రూపాయలను అదనంగా కేటాయించారు. మొత్తం కేటాయింపులో 13వేల 302 కోట్లు బేసిక్ గ్రాంట్లుగా, 3 వేల 325 కోట్లు పర్ఫార్మెన్స్ గ్రాంట్లుగా అందనున్నాయి.

---

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగాను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. యోగాంధ్ర-2026 లో భాగంగా ఈ రోజు ఉదయం విజయవాడ బేరంపార్క్ వద్ద నిర్వహించిన ప్రత్యేక యోగాభ్యసన కార్యక్రమం లో కలెక్టర్ లక్ష్మీష మాట్లాడుతూ.... ఆయుష్ ఆయుష్ విభాగం రూపొందించిన 45 నిమిషాల యోగా మార్గదర్శకాల ఆధారంగా యోగాను ప్రతి వర్గానికీ చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

---

దక్షిణ కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంస్థ, విజయవాడ డివిజన్ అధికారిక లోగోను సంస్థ అధ్యక్షురాలు స్మృతి చారు మాథుర్ ఈ రోజు విజయవాడ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్మృతి చారు మాథుర్ మాట్లాడుతూ, ఈ లోగో కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదని, ప్రతి మహిళలోని శక్తి, ఐక్యత, సేవాభావాన్ని ప్రతిబింబించే ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం సంస్థ మరింత విస్తృతంగా పనిచేయాలన్న సంకల్పానికి ఇది నూతన ఉత్సాహాన్ని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు.

---------------------------

ఖరీఫ్ పంటకాలం ప్రారంభ మైనందున రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరంలో ఎరువుల గోదాములను తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, సరఫరా వ్యవస్థ, విక్రయాలను ఆమె నిన్న పరిశీలించారు. ఆధార్ ఆధారిత ఆన్లైన్ విధానంలో యూరియా, డి.ఏ.పీ. ఎరువులను రైతులు కొనుగోలు చేసే ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎరువుల బస్తాలపై ముద్రించిన ధరలను ప్రభుత్వ రాయితీ ధరలు, రైతులకు విక్రయిస్తున్న ధరలు వంటి విషయాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లు, స్వచ్ఛ పథం కార్యక్రమాల అమలుపై అధికారులు దృష్టి సారించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆమె నిన్న మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసే పన్నుల్లో గ్రంథాలయ సెస్‌ను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రతి బుధవారం తప్పనిసరిగా నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి సరఫరా వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించి క్లోరినేషన్ తప్పని సరిగా అమలు చేయాలన్నారు. వాటర్ ట్యాంకుల శుభ్రత, నీటి నమూనాల పరీక్షల ద్వారా డయేరియా, ఫుడ్ పాయిజనింగ్‌ను నివారించాలని కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

గిరిజన రైతులు పండిస్తున్న వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి వారి ఆదాయాన్ని పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజనులు పండించిన పంట ను ఇతర ప్రాంతాలకు నిన్న అమ్మకాలకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని గిరిజన రైతులు సహజ పద్ధతుల్లో అధిక నాణ్యత కలిగిన పైనాపిల్ పంటను సాగు చేస్తున్నారన్నారు.

=====================